క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పరిధిలో నిరుపేదలకు ప్రభుత్వం రాయితీతో అందించే రేషన్ పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, అలా లేనిపక్షంలో వచ్చే నెలకు రేషన్ రాదని తహసీల్దారు రామాంజులు నాయక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ నమోదు తప్పనిసరి చేసినందున, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికీ ఈకేవైసీ చేయించుకోకుంటే వచ్చే నెల నుంచి రేషన్ బియ్యం పొందేందుకు వీలుండదని స్పష్టం చేశారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకున్న బాషా

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బాషాకు డాక్టరేట్ లభించినట్లు ఎంబీయూ యాజమాన్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో 2017లో పరిశోధకుడిగా చేరాడు. ప్రొఫెసర్ పవన్ కుమార్ పర్యవేక్షణలో ''ఎ హైబ్రీడ్ వాకింగ్ అసిస్టెంట్ సిస్టెమ్ ఫర్ విజువలీ ఇంపైర్డ్ పీపుల్ త్రూ సెన్సార్, ఐఓటీ టెక్నాలజీ'' అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేశాడు. ఆయన చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ అందిస్తున్నట్లు తెలిపారు. బాషాకు డాక్టరేట్ రావడంపై చాన్సలర్ మోహన్ బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణుతో పాటు కళాశాల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని ధర్నా


సీపీఎం నేతలతో కలసి తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న ఇందిరమ్మ కాలనీవాసులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తణపల్లి ఇందిరమ్మ కాలనీ వాసులు ప్రతి నెలా రేషన్ కోసం ఇబ్బంది పడుతున్నామని.. తక్షణం రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు తహసీల్దారు కార్యాలయం ముందు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జయచంద్ర మాట్లాడుతూ తణపల్లి ఇందిరమ్మ కాలనీలో 800 ఇళ్లలో నిరుపేదలు కాపురం ఉంటున్నారని, అయితే అక్కడ రేషన్ షాపు లేకపోవడంతో చుట్టు పక్కల పంచాయతీలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో కాలనీ వద్దకే బియ్యం సరఫరా చేసే వ్యాను వచ్చేదని, ఇప్పుడు దానిని తొలగించడంతో ప్రతినెలా బియ్యం కోసం కష్టాలు పడుతున్నారని తెలిపారు. అక్కడ ఒక కాలనీ ఉందన్న విషయం కూడా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు మరచిపోయారని విమర్శించారు. తాగడానికి మంచినీరు లేదని.. తమ కష్టాలు తీర్చేవారు లేరా..? అని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రామాంజులు నాయక్‌కు వినతిపత్రం అందించారు. ధర్నాలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సెమినార్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళావర్సిటీ ఎస్ఎస్ఐఈ టీబీఐ సెంటర్ ఆధ్వర్యంలో ఎనీ బ్లింగ్ పార్ట్నర్ ఆఫ్ జెనిసిస్ ఎంఎస్‌హెచ్ పథకంలో భాగంగా ఐడియా టు ఐకాన్ స్టార్టప్ గ్రోత్ స్ట్రాటజీస్ అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో హైదరాబాద్‌లోని ఫినామిక్స్ క్యాపిటల్ మేనేజింగ్ పార్ట్నర్ అండ్ సీఈఓ డాక్టర్ వడ్డీ సత్యనారాయణ పాల్గొని, వాట్ మేక్స్ స్టార్టప్ ఫండబుల్ అనే అంశంపై ప్రసంగించారు. వీసీ ప్రొఫెసర్ ఉమ సెమినార్‌లో పాల్గొని జెనిసిస్ పథకం కింద ఎంపిక చేసిన స్టార్టప్‌లకు గ్రాంట్ ఒప్పంద పత్రాలను అందజేశారు. ఈ సెమినార్‌లో హైదరాబాద్ జెన్ బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పాలడుగు నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ రజిని, టీబీఐ సీఈఓ డాక్టర్ జె సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తప్రదాత


రుయాలో రక్తదానం చేస్తున్న భార్గవ్ సాయి

తిరుపతి సిటీ: రుయాలో చికిత్స పొందుతూ ఆపదలో ఉన్న మహిళకు జైభారత్ నేషనల్ పార్టీ విద్యార్థి విభాగం రాయలసీమ యూత్ వింగ్ ప్రెసిడెంట్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యూత్ వింగ్ స్పోక్స్‌పర్సన్ ఎస్వీ భార్గవ్ సాయి రక్తదానం చేశారు. పీజీ విద్యార్థిగా ఉంటూ ఇప్పటివరకు ఆపదలో ఉన్నవారికి 14సార్లు ఆయన రక్త దానం చేసి ఆదుకోవడం విశేషం.

గీత దాటితే.. అంతే సంగతి

- వర్సిటీ అధికారులకు తలనొప్పిగా మారిన డీడీఈ పరీక్షల నిర్వహణ
- యూజీసీ నిబంధనలకు లోబడి నిర్వహించాలని కోర్టు ఆదేశాలు
- అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ రికార్డింగ్ తప్పనిసరి
- బెంబేలెత్తుతున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ డీడీఈ పరీక్షల నిర్వహణ వర్సిటీ అధికారులకు తలనొప్పిగా మారింది. ఇప్పటికే పలు దఫాలుగా వాయిదా పడడం.. న్యాయస్థానాల వరకు సైతం వెళ్లడంతో అధికారులు ఎటూ పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి డీడీఈ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించిన రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలు సైతం కఠినంగా ఉండాలని ఆదేశించింది. యూజీసీ డెబ్ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ పరీక్షల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించడంతో అధికారులు చర్చోపచర్చల్లో మునిగి తేలుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందనే ఆలోచనలో పడ్డారు.

యూజీసీ డెబ్ 2020 నిబంధనలు ఇలా..

- పరీక్షల కేంద్రంలో సీసీటీవీ రికార్డింగ్ తప్పనిసరి
- సీసీటీవీ ఫుటేజీలు ఐదేళ్ల పాటు భద్రపరచాలి
- పరీక్షలను ప్రభుత్వ కళాశాలలో మాత్రమే నిర్వహించాలి
- ఇతర జిల్లా, రాష్ట్రాల్లోని స్టడీ సెంటర్లలో కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే పరీక్షల నిర్వహణ ఉండాలి
- విద్యార్థుల ఆధార్ అటెండెన్స్ తప్పనిసరి
- పరీక్షా పత్రాలను సైతం పోలీసు పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాలకు తరలించాలి



ఎస్వీయూ డీడీఈ పరిపాలనా భవనం

నిబంధనలు అతిక్రమిస్తే అంతే సంగతులా...

యూజీసీ డెబ్ నిబంధనలను అతిక్రమిస్తే వర్సిటీ అధికారులకు న్యాయపరమైన చిక్కులు తప్పేటట్టు లేవని వర్సిటీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిబంధనలు పాటించని పక్షంలో అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున డిమాండు చేయడంతో పాటు కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో డీడీఈ పరీక్షల నిర్వహణ వర్సిటీ అధికారులకు సవాల్‌గా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీత్యాగరాజస్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 9.30 గంటల వరకు త్యాగరాజ మండపంలో అన్నమయ్య సంకీర్తనోత్సవాలు
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేటీ రోడ్డులోని సప్తగిరినగర్, కమ్మసంఘం హాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం ప్రారంభం
- మహతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి ఫ్యూచర్ ఆన్ ప్రీస్కూల్ 6వ వార్షికోత్సవం
- నగరంలోని శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 26న అంకురార్పణ నిర్వహిస్తారు.

వీసీని నియమించకపోవడం సిగ్గు చేటు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు, వర్సిటీ విద్యార్థులు

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 10 నెలలు కావొస్తున్నా ఎస్వీయూకి పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌ను నియమించకపోవడం సిగ్గు చేటని విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం వారు ఎస్వీయూ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏపీలో పేరొందిన పలు వర్సిటీల్లో మేధావులకు కొదవలేదని, వారిని పక్కన పెట్టి వేరే రాష్ట్రాల నుంచి వలసవాదులను వీసీలుగా నియమిస్తే సహించమని హెచ్చరించారు. వీసీ నియామకాల కోసం నియమించిన సర్చ్ కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అభివృద్ధిని ఆకాంక్షించి కూటమి ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని, లేనిపక్షంలో విద్యార్థుల తిరుగుబాటుకు గురికాక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్, ఎస్సీ, ఎస్టీ స్కాలర్స్ విభాగపు ఎస్వీయూ అధ్యక్షుడు మురళీకృష్ణ, మాదిగ జనసైన్యం వ్యవస్థాపకులు సుధాకర్ మాదిగ, భారతీయ దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు యుగంధర్, భారతీయ దళితసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేడీ ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా సెక్రటరీ లోకేష్, మాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుకుమార్, బీసీ సంఘం నాయకుడు తిరుమలేష్, బీసీవై పార్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు విక్రమ్, ఏపీ స్టూడెంట్స్ రైట్ యూనియన్ సెక్రటరీ ముని, ప్రభు, రాకేష్ పాల్గొన్నారు.

వీసీ ఆకస్మిక తనిఖీ


కేకేసీ కళాశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని అనుబంధ కేకేసీ విద్యా సంస్థ కళాశాలలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ విద్యా సంస్థ పరిధిలో ఎంబీఏ, లా, బీఈడీ కళాశాలను ఎస్వీ యూనివర్సిటీకి అనుబంధంగా నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హోమియోపతి, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలలను సైతం అదే సముదాయంలో నిర్వహించడం తనిఖీల్లో వెలుగు చూసింది. బీఈడీ, ఎంబీఏ కళాశాలకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఎవరు లేకపోవడం, బీఈడీ కళాశాలలో నర్సింగ్ కళాశాలను నిర్వహించడం తనిఖీల్లో వెలుగు చూసింది. దీనిపై ఉపకులపతి స్పందిస్తూ ఆ కళాశాలలో పలు కోర్సులనూ ఎందుకు రద్దు చేయకూడదో తాఖీదు ఇవ్వాలని అధికారులను కోరారు.

ఎస్వీడబ్ల్యూ విద్యార్థులకు క్యాష్ అవార్డులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ: జాతీయ గీతా ప్రచార సమితి ఇటీవల నగరంలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు సాధించారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపల్ తిరుమల నారాయణమ్మ గురువారం విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలన్నారు. భగవద్గీతను చదవటంతో నాయకత్వ లక్షణాలు, జీవన అంతర్యం, విజ్ఞానం సిద్ధిస్తుందన్నారు. విద్యార్థులు భగవద్గీత పఠనం దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల కోకరికులర్ కోఆర్డినేటర్ కృష్ణవేణి మాట్లాడుతూ భగవద్గీతలోని కర్మ, భక్తి, జ్ఞానమార్గాలపై విద్యార్థినులు జ్ఞానాన్ని పొందాలన్నారు. నగదు బహుమతులు పొందిన వారిలో విద్యార్థులు హరిత, లలిత, లహరి, విజయశ్రీ, మానసగీత, దుర్గాదేవి, నవిత, నందిని, తనుశ్రీ తదితరులు ఉన్నారు.

ర్యాంకుల ఆధారంగానే స్విమ్స్‌లో సీట్ల భర్తీ

తిరుపతి తుడా : స్విమ్స్ వర్సిటీలో బీఎస్సీ నర్సింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరఫీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్(పారా మెడికల్) కోర్సులలో 2025-26 సంవత్సరానికి ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు ద్వారానే భర్తీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. పై కోర్సులకు ప్రవేశం పొందాలంటే విద్యార్థులు కచ్చితంగా ఏపీఈఏపీసెట్‌లో అర్హత పొంది ఉండాలని పేర్కొన్నారు.

25 వరకు అడ్మిషన్లకు దరఖాస్తులు

తిరుపతి సిటీ: తిరుపతి జూపార్క్ రోడ్డులోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రేష్మా ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలతో పాటు 6, 7, 8, 9వ తరగతుల్లో ప్రస్తుతం ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత గల విద్యార్థులు తమ తల్లిదండ్రుల సహకారంతో ఆన్‌లైన్ ద్వారా 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. httpr://mjpapbcwreir.a pcfrr.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 27వ తేదీన 5వ తరగతికి, 28వ తేదీన బ్యాక్‌లాగ్ సీట్లకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9490588509 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

తిరుపతి రూరల్‌లో

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తాటితోపు వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ దేవీసులోచన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026వ విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో చేరేందుకు 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే బ్యాక్‌లాగ్‌లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా వున్న సీట్లను కొత్తవారికి కేటాయించడం జరుగుతుందన్నారు.

మార్కెట్లు, దుకాణాల వేలం వాయిదా

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మార్కెట్లు, దుకాణాలకు శుక్రవారం నిర్వహించాల్సిన వేలంపాటను 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి తిరుపతి పర్యటన సందర్భంగా గురువారం నిర్వహించాల్సిన సీల్డ్ టెండర్, బహిరంగవేలం 22న శనివారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నామని కమిషనర్ ప్రకటనలో తెలిపారు.

భగత్‌సింగ్‌కు నివాళి


మాట్లాడుతున్న రాఘవశర్మ

తిరుపతి సిటీ: భగత్‌సింగ్ స్ఫూర్తితో మతవిద్వేషాలకు, మతోన్మాదానికి వ్యతిరేఖంగా పోరాడాలని సీనియర్ జర్నలిస్టు, రచయిత రాఘవశర్మ పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్ఓ) ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సభ గురువారం ఎస్వీ యూనివర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియం పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆర్ ఆషా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, సురేష్, ఎస్వీయూ ప్రొఫెసర్ గోవిందులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగనిరతికి ప్రతీక రంజాన్


మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఉమాపతి

తిరుపతి కల్చరల్: త్యాగనిరతికి ప్రతీక పవిత్ర రంజాన్ పండుగ అని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఉమాపతి తెలిపారు. రాస్ మహిళా పొదుపు సంఘాల గౌరవార్థం రాస్ కార్యాలయంలో గురువారం ముందస్తు రంజాన్ వేడుకలు(ఇఫ్తార్‌విందు) అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి మహిళ ఇంటికే పరిమితం కాకుండా స్వశక్తితో ఎదిగి కుటుంబ ఆర్థిక అభివృద్ధికి, సమాజానికి ఉపయోగపడాలని తెలిపారు. కెనరా బ్యాంక్ అధికారి రియాజ్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సుమారు 150 మంది సంఘ సభ్యులు, రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకుడు వి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు

తిరుమలలో పాముల కలకలం


పామును పట్టుకున్న భాస్కర్‌యుడు

తిరుమల : తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండు భారీ పాములు కలకలం సృష్టించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్ నాయుడు కథనం మేరకు.. అలిపిరి- తిరుమల నడక మార్గంలోని గాలిగోపురం వద్ద ఎనిమిది అడుగులు పాము వచ్చినట్లు స్థానికులు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న భాస్కర్‌నాయుడు చాకచక్యంగా పామును పట్టుకున్నారు. అనంతరం స్థానిక విజయ బ్యాంక్ సమీపంలో పాము ఉన్నట్లు సమాచారం అందగా పామును పట్టుకున్నారు. అనంతరం పాములను అవ్వాచారి కోనలో విడిచిపెట్టారు.

శ్రీవారి సేవలో సినీ గాయకుడు


సినీ గాయకుడు మనో

తిరుమల: శ్రీవారిని సినీ గాయకుడు మనో గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలిచ్చి, సత్కరించారు.

అవగాహనతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్: ఆరోగ్యమే మహాభాగ్యమన్న నానుడిని అనుసరించి ప్రతి ఒక్కరూ అవగాహనతో ఆరోగ్యం పట్ల జాగ్రత వహిస్తూ ఆరోగ్య జీవించాలని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు. టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం గాంధీభవన్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ కోసం అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం సుమారు 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పీ4 సర్వేకు సహకరించండి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా పీ4 సర్వే జరుగుతుందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు చేస్తున్న పీ4 సర్వేను అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సర్వే ఉద్దేశం 20 శాతం అట్టడుగున ఉన్న పేదలను గుర్తించి, వారికి అన్ని విధాల సంపన్న కుటుంబాలకు చెందిన వారు సాయం చేసేలా చర్యలు చేపడతామన్నారు. డీఆర్వో నరసింహులు, సీపీఓ ప్రేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలకు అంతం లేదా?



ఇల్లు కూల్చక ముందు


ఇల్లు కూల్చిన తరువాత

పాకాల: కూటమి పార్టీల్లో చేరకపోతే ఇళ్లు కూల్చేస్తారా? దేవుడా అంటూ పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు. పాకాల మండలంలోని గుండ్లగుట్టపల్లి హైరోడ్డుకు సమీపంలో అదే గ్రామానికి చెందిన భానుప్రసాద్ భార్య భాగ్యమ్మ టిఫిన్ సెంటర్ పెట్టుకోవడానికి ఇంటిని నిర్మిస్తున్నారు. గతంలో భానుప్రసాద్ సైట్ ఇంజినీర్‌గా పని చేసేవాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి దెబ్బ తగలడంతో అతని భార్య టిఫిన్ సెంటర్ పెట్టుకోవడానికి ఈ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ స్థలం సుమారు 30 ఏళ్లుగా వారి కుటుంబం ఆధీనంలోనే ఉంది. ఈ క్రమంలో వారు రూ.3 లక్షల వరకు ఖర్చు చేసి మోల్డింగ్ లెవల్ వరకు ఇల్లు నిర్మించారు. గురువారం రెవెన్యూ అధికారులు జేసీబీతో ఎవరూ లేని సమయంలో భాగ్యమ్మ ఇంటిని కూల్చేశారు. రెవెన్యూ అధికారులు కూటమి నాయకులకు కొమ్ము కాస్తూ ఇంటిని కూల్చేశారని బాధితులు బాధపడుతున్నారు తమతో పాటు అదే స్థలంలో ఆరుగురు ఇళ్లు నిర్మించుకున్నారని, అవి కనిపించలేదా? అని ప్రశ్నించారు.

టీడీపీ నాయకుడు చెప్పిన మాటలివీ..

తమ ఇంటిని కూల్చేశారని టీడీపీ మండల కన్వీనర్ నాగరాజనాయుడికి బాధితురాలు విన్నవించగా మీరు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నారన్నారని తెలిపారు. టీడీపీలో చేరితే ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పినట్లు బాధితురాలు వాపోయారు. టీడీపీ కండువాలు కప్పుకున్న తరువాతే మీకు ఏపనైనా చేస్తామని, అప్పటి వరకు ఎవరు చెప్పినా? వినేది లేదని ఆ నాయకుడు తెలిపారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

కూల్చివేత దారుణం

అక్రమంగా ఇల్లు కూల్చివేడయం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్ రెడ్డి ఖండించారు. చిన్న వ్యాపారం చేసుకుని కడుపు నింపుకునేందుకు నిర్మించుకున్న ఇంటిని ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు జారీ చేయకుండా కూల్చివేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వానికి కొమ్ము కాస్తూ అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. అధికారులు చట్ట ప్రకారం విధులు నిర్వహించాలని, కోర్టులలో బాధితులవైపు నిలబడి పోరాటం చేయడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు.

తహసీల్దార్ ఏమన్నారంటే..

సర్వే నంబర్ 325లోని హైరోడ్డు రోడ్డు పోరంబోకు స్థలంలో నూతనంగా అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కాపాడడం ప్రభుత్వ అధికారిగా తన బాధ్యత అన్నారు. 10 రోజుల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు అక్రమంగా ఇల్లు నిర్మించకూడదని సమాచారం కూడా ఇచ్చారని, నిర్మాణం చేపట్టే వారు స్పందించకపోవడంతో ఆక్రమణను తొలగించామని తెలిపారు.

భక్తులపై గాజు బాటిల్‌తో దాడి


దాడి చేసిన కార్తికేయ


గాయపడిన వారు

తిరుమల : క్షణికావేశంలో ఓ భక్తుడు మరో ఇద్దరు భక్తులపై గాజు వాటర్ బాటిల్‌తో దాడికి పాల్పడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం, బళ్లారికి చెందిన గోవిందరాజు, హంపయ్య తమ కుటుంబంలోని 13 మందితో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. స్థానిక సీఆర్వో కేంద్రం వద్ద గదుల కోసం వేచి ఉన్నారు. అదే సమయంలో తమిళనాడు, కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ తన కుమారుడితో కలిసి సీఆర్వో వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఓ కుర్చీలో లగేజీని పక్కన పెట్టి బాబును కూర్చోబెట్టడంతో ఇద్దరు భక్తుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో కార్తికేయ సమీపంలోని గాజు వాటర్ బాటిల్‌తో గోవిందరాజు తలపై దాడి చేయడంతో, పక్కనే ఉన్న హంపయ్యకు గాజు పెంకులు గుచ్చుకుని గాయాలయ్యాయి. వారిని భద్రతా సిబ్బంది టీటీడీ అశ్విని ఆస్పత్రికి తరలించారు. తిరుమల టూటౌన్ పీఎస్ ఎస్ఐ లక్ష్మారెడ్డి ఆస్పత్రికి చేరుకుని, ఇరువురిని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

భక్తి రసమయం.. సంకీర్తనాగానం


సంకీర్తలు ఆలపిస్తున్న ప్రియా సిస్టర్స్

తిరుపతి కల్చరల్: ప్రియా సిస్టర్స్ షణ్ముగ ప్రియ, హరిప్రియ బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల గానామృతం ఆద్యంతం భక్తి పారవశ్యంతో సాగుతూ ఆహూతులను ఆకట్టుకుంది. శ్రీత్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో చేపట్టిన అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు గురువారంతో మూడవ రోజుకు చేరుకుంది. ప్రియా సిస్టర్స్ అన్నమయ్య సంకీర్తనలను సుమధుర గానం చేసి ప్రేక్షకుల హృదయాలను రంజింపజేశారు. అనంతరం గాయనీగాయకులను ట్రస్ట్ నిర్వాహకులు సత్కరించి అభినందించారు.

మెకానిక్‌లకు అవగాహన

తిరుపతి కల్చరల్: శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్‌హాస్టల్లో గురువారం మెకానిక్‌లకు బైక్ సర్వీస్ పాయింట్‌పై బోస్ కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. అలాగే లేబర్ లైసెన్స్‌లు అందజేశారు. హాజరైన ప్రతి సభ్యుడికి బహుమతులు అందజేశారు. ఇటీవల మెకానిక్ షాపులో చోరీ జరగడంతో రూ.24 వేలు నష్టపోయిన మెకానిక్‌కు తమ వంతుగా పోగు చేసి నగదును అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ మెకానిక్స్ సంరక్షణలో లక్ష్యంగా అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.